క్లుప్తంగా

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న అజేశ్‌కుమార్

నిర్మల్‌టౌన్: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి అజేశ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు శనివారం న్యాయసేవలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ చట్టాలు, యాసిడ్ దాడులు, బాల్య వివాహాలు, గృహహింస, తదితర చట్టాలపై అవగాహన ఉండాలన్నారు. బాలికల చట్టాలను ఎలా వినియోగించుకోవాలో వివరించారు. న్యాయవాదులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

'కార్పొరేట్ల కొమ్ముకాస్తున్న కేంద్రం'



మాట్లాడుతున్న లక్ష్మి

లక్ష్మణచాంద: కార్పొరేట్ సంస్థలకు కేంద్రం కొమ్ముకాస్తోందని పీవోడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.లక్ష్మి ఆరోపించారు. మండలంలోని చామన్‌పెల్లిలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కార్పొరేట్ సంస్థలకు ప్రభుత్వ రంగ సంస్థలను అప్పగిస్తోందన్నారు. దేశ జనాభాలో సగం ఉన్న మహిళలపై బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మహిళలపై దాడులు, అత్యాచారాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఉపాధ్యక్షురాలు లక్ష్మి, ఐఎఫ్‌టీయూ జిల్లా జాయింట్ సెక్రెటరీ గంగన్న పాల్గొన్నారు.

డ్రెయినేజీ పనులు ప్రారంభం

కుంటాల: మండలంలోని పెంచికల్‌పాడ్‌లో సీసీ డ్రెయినేజీ నిర్మాణ పనులను ఎంపీపీ అప్క గజ్జారాం యాదవ్ శనివారం ప్రారంభించారు. వైస్ ఎంపీపీ మానిక, సర్పంచ్ భోజాబాయి, ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, కార్యదర్శి సారిక, నాయకులు చంద్రకాంత్, గంగాధర్, గంగారెడ్డి, భూమన్న, రాజు, శ్రావణ్ పాల్గొన్నారు.

సెక్టోరల్ అధికారిని తొలగించాలి

నిర్మల్‌చైన్‌గేట్: కేంద్ర ప్రభుత్వ పథకమైన పీఎం శ్రీ పాఠశాలల ఎంపిక ప్రక్రియలో అవకతవకలకు పాల్పడుతున్న జిల్లా విద్యాశాఖ సెక్టోరల్ అధికారి పదవి నుంచి నాగుల రవిగౌడ్‌ను తొలగించాలని కుంటాల మండల ఓలా పంచాయతీ సర్పంచ్ కనీజ్ ఫాతిమా అన్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డి, డీఈవో రవీందర్ రెడ్డికి శనివారం ఫిర్యాదు చేశారు. మెరిట్‌లో వచ్చిన పాఠశాలలను కాదని, తక్కువ మార్కులు పొందిన బడులను ఎంపిక చేస్తున్నారని తెలిపారు.

ఎస్సీ స్టడీ సర్కిల్ సందర్శన



సందర్శిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో ఎం.ఎం డిఫెన్స్ అకాడమీలో నిర్వహిస్తున్న ఎస్సీ స్టడీ సర్కిల్‌ను మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ శనివారం సందర్శించారు. శిక్షణ తరగతుల నిర్వహణ గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. గ్రూప్–2, గ్రూప్–3 పోటీ పరీక్షల సందర్భంగా స్టడీ సర్కిల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎస్సీ జిల్లా సంక్షేమ అధికారి రాజేశ్వర్‌గౌడ్, అకాడమీ డైరెక్టర్ రాజేశ్వర్ ఉన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

కడెం: విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో రాణించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాదవ్ వెంకట్రావ్ అన్నారు. మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల వార్షికోత్సవానికి శనివారం ఆయన హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. ఏపీఎంవో శివాజీ, వార్డెన్ రాంజీ, రాజేశ్‌నాయక్, రాజేందర్‌నాయక్, తదితరులు ఉన్నారు.

గ్యాస్ ధర వెంటనే తగ్గించాలి

ఖానాపూర్: కేంద్రప్రభుత్వం పెంచిన వంటగ్యాస్ ధరను వెంటనే తగ్గించాలని లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గోవింద్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలతో సామాన్య కుటుంబాల పూట గడవని పరిస్థితి ఉందన్నారు. పెరిగిన వంటగ్యాస్‌తో ఆయా కుటుంబాలపై మరింత భారం పడనుందని తెలిపారు. సమావేశంలో నాయకులు అశోక్, షమీ, నవీన్ ఉన్నారు.

మెష్ డోర్స్‌కు భలే గిరాకీ

- దోమల నివారణ కోసం తయారీ
- ఇళ్లు, కార్యాలయాల్లో వినియోగం
- సింగిల్, డబుల్ డోర్లుగా లభ్యం
- పల్లెల్లోనూ పెరిగిన వినియోగం

నిర్మల్‌చైన్‌గేట్: వర్షాకాలంతోపాటు చలికాలంలో దోమలు విజృంభిస్తుంటాయి. వీటి బారినపడకుండా ఉండేందుకు ప్రజలు అపసోపాలు పడుతుంటారు. ఇళ్లు, కార్యాలయాల్లో యజమానులు చేతిలో దోమల బ్యాట్ పట్టుకుని కూర్చున్నా, వరండాలో ఫ్యాన్ వేసుకున్నా రాత్రి పడుకునే వరకు దోమల కాటు బారిన పడుతుంటారు. వీటిని నివారణకు జిల్లాకేంద్రంలో మెష్ డోర్లు అందుబాటులోకి వచ్చాయి. పల్లె, పట్టణాల్లో వీటి వినియోగం పెరిగిపోతోంది. తక్కువ ధర ఉండడంతో వీటి కొనుగోలుకు జనం ఆసక్తి చూపుతున్నారు.

అందుబాటులోకి..

ఇంట్లోకి ప్రవేశించే ప్రధాన ద్వారం, ఇంటి బయట వైపు ఉండే అన్ని దర్వాజాలకు బిగించేందుకు మెష్ డోర్లు అందుబాటులో ఉన్నాయి. సింగిల్ తోపాటు డబుల్ డోర్లు లభిస్తున్నాయి. వీటితో పాటు డ్రిల్ విధానంలో మెష్ డోర్లను తయారు



వివిధ రకాల మెష్ డోర్లు

చేస్తున్నారు నిర్వాహకులు. ప్రధాన ద్వారం కర్రకు పైభాగంలో బిగిస్తున్నారు. అల్యూమినీయం కిటికీలకు డిమాండ్ పెరుగుతోంది. టేకు కర్రతో చేసిన మాదిరిగా రెక్కలు తయారీ చేస్తుండగా స్లైడింగ్ రెక్కలు అందుబాటులోకి వచ్చాయి. ఈ స్లైడింగ్ డోర్లలో టూట్రాక్, త్రీట్రాక్ అనే రెండు రకాల డోర్లు లభిస్తున్నాయి.

పెరుగుతున్న గిరాకీ

టేకు కర్రకు రోజురోజుకు ధరలు పెరుగుతుండటంతో మెష్ డోర్ల తయారీకి అల్యూమినియం ఉపయోగిస్తున్నారు. దర్వాజ చేరానికి రెండు వైపులా



డోర్లు బిగించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. దర్వాజ మెష్ డోర్ సింగిల్ రూ. 3 వేల వరకు, డబుల్ రెక్కలు రూ. 4 వేల వరకు లభిస్తున్నాయి. డ్రిల్ విధానంలో సింగిల్ డోర్ రూ.6,500, డబుల్ డోర్ రూ. 7,500 వరకు అందుబాటులో ఉన్నాయి. కిటికీల రెక్కల తయారీకి ఒక్కో చదరపు అడుగుకు రూ.1,200 ధర ఉండగా, స్లైడింగ్ డోర్‌లో టూట్రాక్కు చదరపు అడుగుకు రూ.330, త్రీట్రాక్‌కు రూ. 400 ధర ఉంది.

తక్కువ ధరల్లో లభ్యం



అల్యూమినీయం డోర్‌ల వినియోగం పెరుగుతోంది. మెష్ డోర్‌ల వినియోగం నూతన గృహాలకు తప్పనిసరిగా మారింది. వాటర్ ప్రూఫ్ వంటి డోర్లకు డిమాండ్ ఉంది. టేకుతో పోల్చుకుంటే ధరలు తక్కువగా ఉన్నాయి.

– పోడెల్లి అనిరుధ్, గణేశ్ ప్లైవుడ్ షాపు యజమాని

అటెన్షన్ ప్లీజ్ — హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలి



తానూరు: మండలంలోని హంగిర్గా నుంచి దాగాం గ్రామానికి వెళ్లేదారిలో మూలమలుపు వద్ద హెచ్చరిక బోర్డు లేదు. రోడ్డు పనులు చేపట్టిన సంబంధిత కాంట్రాక్టర్ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయలేదు. దీంతో వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

– అధికారి: జగదీశ్, పీఆర్ ఏఈ, సెల్: 91008 53882

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

ముధోల్: ముధోల్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శీతల్‌కర్ అరవింద్ ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద చేపట్టిన ధర్నా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డిగ్రీ కళాశాల లేకపోవడంతో పేద విద్యార్థులు చదువుల కోసం నిజామాబాద్, నిర్మల్‌కు వెళ్తున్నారని అన్నారు. దూర ప్రాంతాలకు వెళ్తుండడంతో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి విద్యార్థికి బస్‌పాస్‌లు ఉచితంగా అందించాలని అన్నారు. ముధోల్ బీసీ, ఎస్సీ, ఎస్టీ బాలికలు, బాలురలకు మేనేజ్‌మెంట్ హాస్టల్



ధర్నా నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కేజీబీవీలో ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని, అదే విధంగా ఎంఈవో పోస్టు భర్తీ చేయాలన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు నవీన్, ముధోల్ డివిజన్ నాయకులు పరమేశ్వర్, ప్రేమనంద్, చరణ్, దత్తు, అనిల్, గంగాప్రసాద్, శ్రీకాంత్ ఉన్నారు.

'ఆర్‌ఎస్‌ఎస్ పథసంచలన్‌కు తరలిరండి'

భైంసాటౌన్: ఆర్‌ఎస్‌ఎస్ భైంసా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించనున్న పథసంచలన్, శారీరక్ ప్రధానోత్సవ కార్యక్రమానికి హిందూబంధువులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని నగర సంఘచాలక్ సాదుల కృష్ణదాస్ కోరారు. ఈ మేరకు శనివారం సుభద్రవాటిక శిశుమందిర్ పాఠశాలలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు స్థానిక సుభద్రనిలయ నుంచి భగత్‌సింగ్ చౌక్, వివేకానంద చౌక్, కుబీర్ రోడ్డు, పద్మావతి కాలనీ, మున్సిపల్ కార్యాలయం ముందు నుంచి వినాయక్‌నగర్, న్యూ మహాలక్ష్మి జువెల్లరీ మార్కెట్ మీదుగా తిరిగి భగత్‌సింగ్‌చౌక్ నుంచి ఐబీ చౌరస్తా, శివాజీచౌక్, ఆర్టీసీ డిపో నుంచి సుభద్రనిలయం వరకు ఈ కార్యక్రమం కొనసాగు



మాట్లాడుతున్న ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు

తుందన్నారు. హిందూ సమాజాన్ని జాగృతం చేసేందుకు ఆర్‌ఎస్‌ఎస్ 98 ఏళ్లుగా కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు సరికొండ దామోదర్, సతీశ్ ఛాత్రే ఉన్నారు.

కొనసాగుతున్న అఖండ హరినామ సప్తాహం

తానూరు: మండలంలోని మొగ్లి గ్రామంలో కొనసాగుతున్న అఖండ హరినామ సప్తాహం శనివారంతో రెండోరోజుకు చేరింది. ఉదయం జ్ఞానేశ్వరి పారాయణం, మధ్యాహ్నం భజన, రాత్రి కీర్తన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. రాత్రి నిర్వహించిన కీర్తన కార్యక్రమానికి ఆయా గ్రామాల వార్‌కరి భక్తులు పాల్గొంటున్నారు. వీరి కోసం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. సప్తాహం కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

ముధోల్: ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. మండలంలోని వెంకటాపూర్‌లో శ్రీవేంకటేశ్వర ఆలయ నిర్మాణానికి రూ.24 లక్షల నిధులతో శనివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ఆలయ నిర్మాణాలకు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి నిధులు మంజూరు చేస్తున్నారని తెలిపారు. ఆలయ నిర్మాణాలకు స్థలం ఇచ్చిన యువకులు శ్రీనివాస్, భోజేందర్‌లను అభినందించారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా రూ.5 లక్షలతో సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

ఎమ్మెల్యేను సన్మానించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆఫ్రోజ్‌ఖాన్, మండల పరిషత్ ఉపాధ్యక్షులు లావణ్యరవీందర్‌రెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, ఎంపీటీసీ బండారి గంగాధర్, సర్పంచులు సాయినాథ్, మరిభ, నాయకులు రవికుమార్ తదితరులు ఉన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే రేఖానాయక్

పెంబి: మండల కేంద్రంతోపాటు పెంబితాండ, ఇటిక్యాల్ తాండ, ఇటిక్యాల్, లోతర్యతాండ, తాటిగూడ, పుల్గంపాండ్రి గ్రామాల్లో ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ పర్యటించి లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదింటి ఆడపడుచులకు పెళ్లిళ్ల కోసం ప్రభుత్వం కల్యాణ లక్ష్మి పథకం ప్రవేశపెట్టిందన్నారు. వైస్ ఎంపీపీ గంగారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల శంకర్, సర్పంచులు పూర్ణచందర్‌గౌడ్, సుదర్శన్, మహేందర్, తహసీల్దార్ శ్రీధర్, ఎంపీడీవో సుధాకర్, నాయకులు విలాస్, రాజేందర్, విక్రమ్‌నాయక్, తదితరులు ఉన్నారు.

అమరుల కుటుంబాలను ఆదుకోవడంలో విఫలం

ఖానాపూర్: రాష్ట్ర సాధనలో భాగంగా మలిదశ ఉద్యమంలో పోరాడి అమరులైన కుటుంబాలను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు కడపత్రి తిలక్‌రావు ఆరోపించారు. పట్టణంలోని విశ్రాంతి భవనంలో శనివారం ఆయన మాట్లాడారు. ఉద్యమకారులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. తెలంగాణ జనసమితి ఆధ్వర్యంలో ఈనెల 10న నిర్వహించే తెలంగాణ బచావో సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. బెన్ని, దేవిదాస్, సతీశ్, కిషన్, చిన్నా పాల్గొన్నారు.

అన్నిరంగాల్లో ముందుండాలి

కుంటాల/నర్సాపూర్(జి)/లోకేశ్వరం: మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీవిశారద పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కుంటాల మండలం సూర్యపూర్, లింబా (కే) గ్రామాల్లో శనివారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సర్పంచులు సునీత, ఆనంద్‌రావు పటేల్ ఉన్నారు. నర్సాపూర్(జి) మండలం గొల్లమాడ, లోకేశ్వరం మండలం జోహర్‌పూర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో పలు అంశాలపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ రజినీదేవి,మీనా, హెచ్‌ఎంలు నారాయణరెడ్డి, మారుతి, సర్పంచ్ ముత్తవ్వ ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఖానాపూర్: బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి చరణ్ తాత భీమన్న మృతిచెందగా మండలంలోని గోసంపల్లె గ్రామంలో బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే రేఖానాయక్ శనివారం పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట నాయకులు రాజేశ్వర్, శ్రీనివాస్, ధర్మరాజు, ప్రదీప్, గాంధీ, రాజేందర్ తదితరులు ఉన్నారు.

రాగిజావ పంపిణీ

కుంటాల: మండలంలోని కల్లూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఉపాధ్యాయులు రాగిజావా శనివారం పంపిణీ చేశారు. విద్యార్థులు రాగిజావ తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని హెచ్‌ఎం అమృతం పేర్కొన్నారు. ఉపాధ్యాయులు వెంకట్రావు తదితరులు ఉన్నారు.

ఖానాపూర్: మండలంలోని పాత ఎల్లాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఉపాధ్యాయుడు వాల్గొట్ కిషన్ శనివారం రాగిజావ పంపిణీ ప్రారంభించారు. పాఠశాలలో విద్యార్థులకు వారంలో మూడు రోజులు సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాగిజావ అందజేస్తున్నారు. మిగతా మూడు రోజులు తన సొంత ఖర్చులతో అందజేస్తానని ఉపాధ్యాయుడు తెలిపాడు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



నృత్యం చేస్తున్న విద్యార్థులు

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. టీజీవో జిల్లా అధ్యక్షుడు అజ్మీరా శ్యామ్‌నాయక్, ఐటీడీఏ ఏసీఎంవో శివాజీ, ఏవో మనోజ్, హెచ్‌ఎం నాగేశ్‌బాబు, మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్, కౌన్సిలర్ చిన్నం సత్యం, పేటా సంఘం రాష్ట్ర నాయకులు బుక్య రమేశ్, మాజీ జెడ్పీటీసీ రామునాయక్, ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోవింద్, వార్డెన్ ప్రేమ్‌సింగ్ తదితరులు ఉన్నారు.

డంపుయార్డ్ తనిఖీ



అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాకేంద్రంలోని బంగల్‌పేట్ సమీపంలో గల డంపుయార్డ్‌ను కలెక్టర్ వరుణ్‌రెడ్డి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. యార్డ్‌లో తడిపొడి చెత్త ద్వారా వర్మీ కంపోస్ట్ పరిశీలించారు. చెత్తను రీసైక్లింగ్ చేయాలని, వాచ్‌మెన్ క్వార్టర్స్, వెయింగ్ బ్రిడ్జి త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. డ్రై రిసోర్స్ సెంటర్‌కు సంబంధించి కొన్ని మార్పులు చేయాలన్నారు. తహసీల్దార్ సుభాష్ చందర్, డీఈ నాగేశ్వర్‌రావ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దేవిదాస్, కాంట్రాక్టర్ ఫారుఖ్‌ఖాన్ ఉన్నారు.

భైంసా నుంచి సికింద్రాబాద్‌కు సూపర్‌లగ్జరీ బస్



బస్ సర్వీస్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, డీఎం అమృత

భైంసాటౌన్: భైంసా నుంచి నిజామాబాద్ మీదుగా సికింద్రాబాద్ వరకు ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్ సర్వీసును ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఎం అమృత కోరారు. కార్యక్రమంలో ఎస్‌టీఐ సరియా, ఏఎంఎఫ్ వెంకటేశ్వర్లు, ఏడీసీ హైమద్ హుస్సేన్, తదితరులున్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు

భైంసాటౌన్: మండలంలోని ఆయా గ్రామాల్లో వాగుల్లో నుంచి రెవెన్యూ అధికారుల అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే వాహనాలు సీజ్ చేస్తామని, జరిమానా సైతం విధిస్తామని తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడారు. వాగుల్లో నుంచి ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకుగాను కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఇకపై వాగుల నుంచి ప్రభుత్వ అవసరాలు మినహా ఇతర అవసరాలకు ఇసుక తరలించాలంటే తహసీల్దార్ పేరిట రూ.808 డీడీ రూపంలో చెల్లించి అనుమతి పొందాల్సి ఉంటుందన్నారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటలలోపు ఇసుక రవాణాకు ట్రాక్టర్లలో మాత్రమే అనుమతిస్తామన్నారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తూ పట్టుబడితే మొదటిసారి రూ.5వేలు, రెండోసారి రూ.10వేలు జరిమానా విధిస్తామన్నారు. అలాగే జీవో నం.58 కింద ఇళ్ల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్నవారికి సంబంధించి పట్టాలు తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించి తీసుకెళ్లాలన్నారు. ఇంకా పట్టాలు రానివారికి త్వరలో పంపిణీ చేస్తామన్నారు. అలాగే జీవో 59 కింద క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్న 125 గజాల కంటే ఎక్కువ స్థలం ఉంటే, నిర్ణీత రుసుం మూడు వాయిదాల్లో చెల్లించి, రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని సూచించారు.

కుంటాల: మండలంలోని వాగుల నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ ఎం.ఏ కలీమ్ హెచ్చరించారు. తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. డీటీ నరేశ్‌గౌడ్, ఆర్ఐ విజయ్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

కనుల పండువగా వేంకటేశుని కల్యాణం



కల్యాణోత్సవం జరిపిస్తున్న వేదపండితులు

భైంసాటౌన్: పట్టణంలోని మహాలక్ష్మి జువెల్లరీ మార్కెట్‌లోగల శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరాలయ 17వ వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం శ్రీదేవి–భూదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. భక్తులు, మహిళలు అధికసంఖ్యలో తరలించారు. ఉదయం 10 గంటలకు ఎదుర్కోలు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య స్వామివారి కల్యాణం జరిపించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తుల కోసం అన్నదానం ఏర్పాటు చేశారు.


బీరప్పదేవుని ఉత్సవాలు

ఖానాపూర్: మండలంలోని తర్లపాడ్‌లో బీరప్పదేవుని ఉత్సవాలు గత మూడురోజులుగా కొనసాగుతున్నాయి. శనివారం గంగాబోనం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామ పురవీధుల గుండా బైండ్లోళ్ల నృత్యాలతో చెరువు వరకు ఊరేగింపు చేపట్టారు. కళాకారుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ ఉత్సవాలకు ఖానాపూర్, కడెం, దస్తురాబాద్, ఉట్నూర్ తదితర మండలాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆదివారం బోనాల ఊరేగింపు, సోమవారం బీరప్ప–కమరాతిల కల్యాణం, మంగళవారం జాతర ఉంటుందని ఆలయకమిటీ సభ్యులు తెలిపారు.



బోనంతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠాపన



విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న గ్రామస్తులు

కుంటాల: మండలంలోని అందకూర్‌లో మహాలక్ష్మీ, ముత్యాలమ్మ, అరెల్లి మైసమ్మ, అడెల్లి పోచమ్మ, ఐదు చేతుల పోచమ్మ, బద్దిపోచమ్మ, తాత ఆఈ, పోతారాజుల విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవాలను శనివారం నిర్వహించారు. గ్రామాల పురవీధుల గుండా ఊరేగింపు చేపట్టగా, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు. తర్వాత వేద పండితులు సదాశివ్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి, బీజేపీ నాయకులు పవార్ రామారావు పటేల్ వేర్వేరుగా పూజలు చేశారు. అనంతరం గ్రామస్తుడు సాగర్‌రావు ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. ఎంపీపీ గజ్జారం యాదవ్, జెడ్పీటీసీ కొత్తపల్లి గంగామణి, సర్పంచ్ దాసరి కిషన్, ఎంపీటీసీ మధుకర్, వీడీసీ పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

లోకేశ్వరం: మండలంలోని భాగాపూర్ గ్రామంలో శనివారం లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో వార్షికోత్సవాన్ని నిర్వహించారు. వేదపండితులు సంతోష్ జ్యోషి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. భక్తులు ఆలయంలో పూజలు చేశారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన

భైంసారూరల్: మండలం కౌతుల్‌గాంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగలక్ష్మి పరిశీలించారు. కేంద్రంలోని పిల్లల వివరాలను తెలుసుకున్నారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించారు. అంగన్‌వాడీ కార్యకర్త మీనా, గర్భిణులు ఉన్నారు.